www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 15 మే 2024
5
అన్నమయ్య



మైదుకూరు ఎమ్మెల్యేపై కేసు నమోదు



ప్రజాశక్తి - చాపాడు

వైఎస్ఆర్ జిల్లామైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిపై కేసు నమోదైంది. ఎమ్మెల్యేతో సహా 11 మంది అనుచరులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సోమవారం పోలింగ్ సందర్భంగా మండల పరిధిలోని చిన్నగులవలూరులో ఇద్దరు టిడిపి ఏజెంట్లు కుచ్చుపాప ఉగ్ర నరసింహులు, వినోద్‌లపై వైసిపి కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనలో ఇరువురికి బలమైన గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని కర్నూలు ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో పాటు పాలగిరి లక్ష్మీనారాయణరెడ్డి, మనీష్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సగిలి చంద్ర ఓబుళరెడ్డి, గంజికుంట హర్షవర్ధన్‌రెడ్డి, బోర్రా శంకర్‌రెడ్డి, ఏరాశి భాస్కర్‌రెడ్డి, పాలగిరి చంద్ర మోహన్‌రెడ్డి, చంగా చంద్ర ఓబుల్‌రెడ్డిలపై చాపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా సోమవారం ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ వంద మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేస్తామని చెప్పారు. 11 మందిపైనే కేసు నమోదు చేశామని చెప్పడం వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అభ్యర్థుల భవితవ్యం భద్రం

పోలీసు రక్షణలో ఇవిఎంలు
19 రోజుల నిరీక్షణకు సిద్ధం
కాకిలెక్కల్లో నేతలు బిజీబిజీ
స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన అధికారులు

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన నేతల భవితవ్యం స్ట్రాంగ్ రూముల్లో నిక్షిప్తమైంది. ఓటింగ్ యంత్రాలను రిమ్స్ సమీపంలోని మను పాలిటెక్నికల్ కళాశాలకు తరలించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పర్యవేక్షిస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన రెండు పార్లమెంట్, 13 అసెంబ్లీ స్థానాలు న్నాయి. వీటి బరిలో నిలిచిన అభ్యర్థులు 19వ రోజులపాటు నిరీక్షించాల్సి వస్తోంది. జూన్ నాలుగు నాటి కౌంటింగ్ ఫలితాలతో స్పష్టత రానుంది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని కడప, రాజంపేట పార్లమెంట్ పరిధిలోని 13 అసెంబ్లీ స్థానాల బరిలో నిలిచిన ప్రధాన పార్టీలకు చెందిన ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఆయా నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ ఆధారంగా జయాపజయాలను మదింపు చేసుకునే పనిలో నిమగ్నం కావడం గమనార్హం.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 30.54 లక్షల మంది ఓటర్లు తీర్పు నిచ్చారు. కడప పార్లమెంట్ పరిధిలో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ నియోజకవర్గాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాల పరిధిలో 32 మంది, 13 అసెంబ్లీల పరిధిలో 180 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. వీరిలో ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపితోపాటు వైసిపి, కూటమికి చెందిన అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అనే రీతిలో పోటీ నెలకొంది. వైసిపి, టిడిపి మధ్య 11 అసెంబ్లీ స్థానాలు, వైసిపి, కూటమి మధ్య రెండు స్థానాల్లో తీవ్రమైన పోటీ నెలకొంది.

ఎవరి ధీమా వారిదే

కడప జిల్లాలోని పులివెందుల, బద్వేల్ స్థానాలపై వైసిపి ధీమాగా ఉంది. కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు అసెంబ్లీ స్థానాలపై టిడిపి ధీమాగా ఉంది. ఇలా ఎవరికి వారి అంచనాలు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వీరిలో ఎవరు గెలిచినా స్వల్ప ఓట్ల తేడాలతో గెలిచే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. అన్నమయ్య జిల్లా పరిధిలోని రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో నువ్వా నేనా అనే రీతిలో పోటీ నెలకొంది. మదనపల్లి, రాయచోటి స్థానాల్లో టిడిపి ఆశగా ఉంది. తంబళ్లపల్లిలో వైసిపి ధీమాగా ఉంది. రాజంపేట, పీలేరుల్లో హోరాహోరీ పోటీ వాతావరణంలో ఉత్కంఠ నెలకొంది. ఎవరు గెలిచిన స్వల్ప ఓట్ల తేడాలతో గెలిచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి తరుపున పోట పడుతున్న జమ్మలమడుగు, రైల్వేకోడూరు అభ్యర్థులు సైతం హోరాహోరీగా తలపడినట్లు తెలుస్తోంది. గెలుపోటములపై పులివెందుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మెజార్టీ తగ్గుదల, కడప, ప్రొదుటూరు, కమలాపురంలో విజయావకాశాలపై పెద్దఎత్తున చర్చనడుస్తోంది.

వైసిపికి ముచ్చెమటలు

కడప పార్లమెంట్ బరిలో హోరాహోరీ పోటీ నడిచింది. వైసిపి అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, టిడిపి అభ్యర్థి భూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిల మధ్య ముక్కోణపు పోటీని తలపించింది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి తిరుగులేని మెజార్టీతో గెలిచిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ వివేకా హత్య కేసు ప్రధాన ఎజెండాగా మారడం, వైఎస్ కుటుంబంలో చీలిక రావడంతో వైసిపి అభ్యర్థికి ముచ్చె మటలు పట్టిస్తోంది. జమ్మలమడుగు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో టిడిపి ఓటర్లు సైతం షర్మిలకు ఓట్లేసినట్లు కనిపిస్తోంది.

క్రాస్ ఓటింగ్ ఎవరిని ముంచేనో

వైసిపి, టిడిపి నుంచి క్రాస్ ఓటింగ్ ఎవరి విజయావకాశాలను దెబ్బతీస్తుందో తెలియడం లేదు. అన్నమయ్య జిల్లాలో రాజంపేట పార్లమెంట్ బరిలో నిలిచిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, కడప పార్లమెంట్ బరిలో వైసిపి తరుపున నిలిచిన సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉందా అనేది చర్చనీయాంశంగా మారింది. రాజంపేట పార్లమెంట్ పరిధిలో కూటమి తరుపున బిజెపి అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, వైసిపి అభ్యర్థి పి.వి మిధున్‌రెడ్డి బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. పీలేరు, తంబళ్లపల్లి, రాజంపేట నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి క్రాస్ ఓటింగ్ నడిచినట్లు తెలుస్తోంది. పుంగనూరు, రాయచోటి, మదనపల్లి, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థి పి.వి.మిధున్‌రెడ్డికి భారీగా ఓట్లు పడినట్లు కనిపిస్తోంది. ఏమైనప్పటికీ క్రాస్ ఓటింగ్ ఏమేరకు ఎవరికి ఏమోతాదులో పడిందనే అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత

- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్నికలకు సంబంధించి ఇవిఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రతను చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించి నియోజకవర్గాల వారీగా రాజంపేట, కోడూరు, రాయచోటి, తంబళ్లపల్లి, పీలేరు, మదనపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన పోల్డ్ ఇవిఎంలను శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి సీల్ వేశామన్నారు. వీటిని అక్కడి స్ట్రాంగ్ రూములలో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూములలో పోల్డ్ ఇవిఎంలను పకడ్బందీగా భద్రపర్చామని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్, ఎన్నికల అబ్జర్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన ఇవిఎంలను శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములలో పగడ్బందీగా భద్రపరిచి సీల్ వేశామన్నారు. ఈ సందర్భంగా అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ కౌంటింగ్ సందర్భంగా అదే రోజు ఉదయం అబ్జర్వర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో సీల్ తొలగించి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. అంతవరకు స్ట్రాంగ్ రూముల దగ్గర అత్యంత పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒలు, ఎన్నికల నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.



ఇవిఎంల తరలింపును పరిశీలిస్తున్న అభిషిక్త్ కిషోర్



స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్న సిబ్బంది

సురక్షితంగా జిల్లా కేంద్రానికి ఇవిఎంలు

రాజంపేట అర్బన్ : రాజంపేట నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు సంబంధించిన సార్వత్రిక ఎన్నికల ఇవిఎం యంత్రాలను మంగళవారం భారీ బందోబస్తు నడుమ రాయచోటిలోని జిల్లా ఎన్నికల అధికారికి సురక్షితంగా చేర్చారు. ముందుగా సోమవారం పోలింగ్ పూర్తవగానే ఇవిఎంలను రాజంపేట అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలకు చేర్చారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఇవిఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. కొన్ని ప్రాంతాలలో రాత్రి 10 గంటలకు పైగా పోలింగ్ నిర్వహించాల్సి రావడంతో ఇవిఎం యంత్రాలను తరలించడంలో కాస్త ఆలస్యం చోటు చేసుకుంది. మంగళవారం పార్లమెంట్, అసెంబ్లీలకు సంబంధించిన ఇవిఎం యంత్రాలను వేర్వేరుగా సీల్ వేసి రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చి జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్‌కు రాజంపేట ఆర్ఒ మోహన్‌రావు అప్పగించారు.

17న మహిళల క్రికెట్ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి - కడప : ఈ నెల 17న కడపలోని ఎసిఎ స్టేడియంలో ఉదయం 7:00 గంటలకు సీనియర్స్, అండర్ -23, అండర్-19, అండర్-15 మహిళా క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనాల్సిందిగా కోరారు. ఎంపికల్లో పాల్గొన దలచిన క్రీడాకారులు తప్పనిసరిగా వైట్ డ్రెస్, ఎవరి క్రికెట్ కిట్ వారే తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటో, స్టడీ సర్టిఫికేట్, టెన్త్ క్లాస్ మార్కుల జాబితా ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు. అండర్-23 ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2001 సెప్టెంబర్ 1 తరువాత జన్మించి ఉండాలని, అండర్-19 ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2005 సెప్టెంబర్ 1 తరువాత జన్మించి ఉండాలని తెలిపారు. అండర్ -15 ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2009 సెప్టెంబర్ 1-2011 ఆగస్టు 31లోపు జన్మించి ఉండాలని తెలిపారు.



ట్రాఫిక్ సమస్యతో నిలిచిపోయిన వాహనాలు

పీలేరులో స్తంభించిన ట్రాఫిక్

- గంటల కొద్దీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణంలో ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించి వాహనాల రాక, పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసు సిబ్బంది తగిన రీతిలో స్పందించకపోవడంతో వాహనాలు ముందుకు కదలక వాహన చోదకులు విసిగి పోవడంతో పాటు పాదచారులు కూడా వాహనాల రద్దీ నుంచి తప్పించుకుని, వాటిని దాటి బయట పడే క్రమంలో చిరాకు పడ్డంతో పాటు అలసిపోక తప్పలేదు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వివిధ ప్రాంతాలలో నివాసముంటూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి స్వగ్రామాలకు చేరుకున్న ప్రజలు, వారు తిరిగి తమ నివాస ప్రాంతాలకు వెళ్లే క్రమంలో వారి వాహనాలు, ప్రయాణీకుల వాహనాలు, ఆర్‌టిసి బస్సులు, పార్సిల్ వాహనాలు, లారీలు, ఇతర వాహనా లతో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం దాక కూడా పట్టణ ప్రధాన రహదారులు వాహనాలతో నిండుకుంది. అందులోనూ పీలేరు ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోనే మంగళ వారం వారపు సంత కూడా ఉండడంతో అటు వాహనాల తాకిడి, ఇటు వారపు సంతకు వచ్చి, వెళ్లే ప్రజల సందడి భారీగా నెలకుంది. పోలీసులకు కూడా ఎన్నికల విధులకు వెళ్లి, తిరిగి తమ సాధారణ విధుల్లో చేరడానికి కొంత ఆలస్యం కావడంతో ఈ సమస్య దాదాపు నాలుగు గంటలకు పైగా చోటు చేసుకుంది. దీంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే సరైన మార్గం : జడ్జి

ప్రజాశక్తి - కడప

వివాదాలను పరిష్కరించుకునేందుకు మంచి పద్ధతి మధ్యవర్తిత్వం అని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్‌లో కడప బార్ అసోసియేషన్ సభ్యులకు న్యాయవాదులకు మధ్యవర్తిత్వం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ, ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి అని పేర్కొన్నారు. ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుంది అని చెప్పారు. విభాగం 89 సిపిసి, ఆర్డర్ 1 రూల్ 10. ప్రత్యామ్నాయ వివాదం స్పష్టత, మధ్యవర్తిత్వ నియమాలు 2017, సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వం రాజీనామా, ప్రాజెక్ట్ కమిటీ నిబంధనలు 2015, మధ్యవర్తిత్వ చట్టం 2023, సెక్షన్ 89 ఆర్డర్స్ X LA 1C, 1D, XXXII-A సివిల్ ప్రొసీడ్యూర్ కోడ్ 1908, మధ్యవర్తిత్వం, రాజీ చట్టం 1996 స్థాపనలను చేయడానికి నిబంధనలను చేస్తుందని తెలిపారు. మీడియేషన్ యాక్ట్ 2023, సెక్షన్.6, 320 సిఆర్‌పిసి మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎమ్. శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, మధ్యవర్తిత్వ న్యాయవాది చంద్రకాంతమ్మ, బారు ప్రెసిడెంట్ బొగ్గుల గుర్రప్ప నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా కారాగారాన్ని సందర్శించిన జడ్జి : ఏమైనా సమస్యలు ఉంటే డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురావచ్చునని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జడ్జి మహిళా కారాగారాన్ని సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థను, పారా లీగల్ వాలంటరీలు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు. అనంతరం ఖైదీల భోజనాలను పరిశీలించారు, ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణవేణి, డిప్యూటీ జైలర్, మహిళా పారా లీగల్ వాలంటరీలు, మహిళా ఖైదీలు పాల్గొన్నారు.

మద్దతు ఇచ్చిన వారికి ధన్యవాదాలు : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఎండను సైతం లెక్కచేయకుండా అర్ధరాత్రి వరకు క్యూలో నిలబడి ఓటు వేసిన ఓటర్లకు సిపిఎం జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాజంపేట పార్లమెంటు, అరు అసెంబ్లీ నియోజకవర్గాలు సహా ఇండియా వేదికలోని సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు ఓటేసిన ప్రజలకు, శ్రేయోభిలాషులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజల తరపున నిరంతరాయంగా పనిచేసిన పౌర సంఘాల నాయకులకు జిల్లా కమిటీ కృతజ్ఞతాభివందనాలు తెలుపుతున్నామన్నారు. లౌకికత్వ పరిరక్షణ కోసం ఎన్నికల్లో పనిచేసిన వివిధ ప్రజాసంఘాలు ప్రత్యేకించి జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో తీర్పు ఎలా ఉన్నప్పటికీ జిల్లా ప్రజల తరపున సిపిఎం నిరంతరాయంగా నిలబడి భవిష్యత్తులో కూడా పోరాడుతుందని హామీ ఇచ్చారు.

ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసిన 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో మూడవ సంవత్సరం విద్యార్థులు హైదరాబాద్ లోని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థలో మూడు నెలల ఇంటర్న్‌షిప్‌ని విజయవంతంగా పూర్తి చేసారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. 'ఎంబెడెడ్ సిస్టమ్స్‌లో స్టడీ ఆఫ్ క్సిలింక్స్ ఎఫ్‌పిజిఎఫ్ అండ్ ఇంప్లిమెంటింగ్ కస్టమ్ ఐపి కోర్ యూసింగ్ క్సిలింక్స్ ప్లాట్ ఫార్మ్' అనే అంశంపై చైతన్య, లక్ష్మిసాయి, భవ్య శ్రీలు మూడునెలల పాటు ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నారని తెలిపారు. విజయవంతంగా పూర్తి చేసిన ఈ విద్యార్థులకు ప్రశంసా పత్రమును, డిఆర్‌డిఒ సంస్థ అందించారని తెలిపారు. ఈ విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్, అధ్యాపకులు విద్యార్థులు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

మౌలిక వసతులు ఎరుగని కాలనీవాసులు

సమాజంలో మనిషి తన మనుగడను సాగించడానికి ప్రధానంగా కూడ, గుడ్డ, నీడ చాలా అవసరం. ప్రజల ప్రాథమిక వసరాలు తీర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ప్రతి ఒక్కరికీ మొదటి రెండు అవసరాలకన్నా ముందు మూడోదైన నీడ అవసరం. వగలంతా కష్టపడి రాత్రి పొద్దుపోయాక గూడు చేరి కాస్త సేద దీరాలనుకుంటాడు. గూడుంటే తనకై మిగిలింది కాస్త అక్కడ దాచుకోడానికి సౌకర్యంగా ఉంటుందని ఆశపడతారు. ప్రభుత్వం అందుకే అర్హులైన నిరుపేదలు, పేదలతోపాటు నగటు మనుషులకూ పక్కా గృహాలిచ్చి వాటి నిర్మాణానికయ్యే ఖర్చులో కొంత రుణంగా అందిస్తుంది.

- **ఇందిరమ్మ కాలనీలో తాగునీటి నమన్యకు పరిష్కారం ఎప్పుడు..?**
- **మురుగు కాలువల్లేక నిరుపయోగంగా మరుగుదొడ్లు**
- **మహిళల ఆత్మ గౌరవానికి భంగంగా పరిస్థితులు**

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి 2007లో నాటి ప్రభుతం అర్హులైన నిరుపేదలు, పేదలకు స్థానిక పీలేరు-చిత్తూరు మార్గంలోని దొడ్డిపల్లి రెవెన్యూ గ్రామం, కాకులారంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పొలాలను ప్రభుత్వం ద్వారా కొనుగోలుచేసి, అక్కడ ఒక్కొక్కరికి రెండేసి సెంట్ల వంతున 2,600 మంది లబ్దిదారులకు ఇంటి నివేశ స్థలాలు కేటాయించారు. అందులో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో ఇండ్లు కూడా మంజూరు చేశారు. అప్పట్లో జిల్లాలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేసిన అతి పెద్ద కాలనీల్లో పీలేరు ఇందిరమ్మ కాలనీ ఒకటిగా గుర్తింపు పొందింది. ఆరంభంలో కాలనీ నిర్మాణాలు, మౌలిక వనతుల కల్పన కోసం లబ్దిదారులు అనేక ఇబ్బందులు వడుతూ, ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయానికి లబ్దిదారులు అంతో ఇంతో అప్పుచేసి అదనపు పెట్టుబడులు పెట్టుకుని తమకు కేటా యించిన స్థలాల్లో అందంగా ఇండ్లను నిర్మించుకున్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో అప్పుడు స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గానికి వలన వెళ్ళాల్సి వచ్చింది. ఆతరువాత కాలనీ వానులకు అవనరమైన నీరు, వీధి దీపాలు, మరుగుదొడ్లు, రోడ్లు, తమ పిల్లలకు సౌకర్యంగా ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మురుగు నీటి కాలువలు తదితర మౌలిక నదుపాయాలను నమకూర్చమంటూ' అక్కడి స్థానికకులు అనేక సార్లు నంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నారు. పీలేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్న నాటి వాల్మీకిపురం ఎమ్మెల్యే నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం చోటుచేసుకున్న పరిణామాల ఫలితంగా 2012లో ముఖ్యమంత్రి అయ్యారు. పీలేరు నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైనన్ని నిధులను కేటాయిస్తూ సంబంధిత అన్ని శాఖలకూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ సమయంలో ఒక్కొక్కటిగా అక్కడి స్థానికుల అవనరాలు తీరుతూ వచ్చాయి. కాలనీలో దాదాపు అన్ని వీధుల్లోనూ సిమెంటు రోడ్లు నిర్మించారు. తాగునీటి నమన్య పరిష్కారానికి కాలనీకి నలువైపులా బోర్లు తవ్వించి కాలనీకి ఉత్తర, దక్షిణ దిశల్లో రెండు సర్ఫేస్ నీటి ట్యాంకులను నిర్మించారు. ఆ తరువాత మరో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం కూడా పూర్తైంది. కాలనీ వానుల తాగునీటి అవసరాల కోసం వేసిన ఆ బోర్ల ద్వారా సేకరించిన నీటిని ట్యాంకులకు వంప్ చేసి వరున క్రమంలో వీధులకు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడి బోర్లలో తగినంత నీరు లేక పోవడంతో 12 రోజులకోసారి కుళాయిల ద్వారా కాలనీ వాసులకు నీటిని అందిస్తున్నారు. స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. ప్రజలు తమ అవసరాల కోసం ట్యాంకరు నీటికి రూ.600 పెట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో ఉన్న తాము డబ్బు పెట్టి నీటిని కొనుగోలు చేయడం కష్టంగా ఉందని అక్కడి ప్రజలు కొందరు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మౌలిక వసతులకు నోచని ఇందిరమ్మ కాలనీ

అంచెలంచెలుగా ప్రస్తుతం సుమారు మూడు వేల ఇండ్లకు చేరువైన ఇందిరమ్మ కాలనీలో మురుగునీటి కాలువల సౌకర్యం సైతం లేదు. అక్కడి స్థానికులు ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్లున్నా వాటిని వినియోగించుకునే భాగ్యం తమకు లేదంటున్నారు. తమ ఇండ్లలో నిర్మించుకున్న మరుగుదొడ్లను ఉపయోగిస్తే వాటి నుంచి వెలువడే వ్యర్థాలు బయటకు వెళ్ళడానికి, స్నానపు గదుల నుంచి వృథా నీరు వెలుపలకు పోవడానికి అవసరమైన మురుగునీటి కాలువలు లేకపోవడంతో అక్కడి స్థానికులు తమ ఇంటి ముందే గోతులు త్రవ్వుకుని నిలువ చేసుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. ఆ నీటిపై ఈగలు, దోమలు చేరి తాము అనారోగ్యాల పాలు గురికావడానికి కారణం అవుతున్నాయని కూడా వారు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మహిళలు తమ ఆత్మగౌరవాన్ని చంపుకుని బహిర్భూమికి చీకటి పడ్డాక వెళుతూ అనేక ఇబ్బందులు, ప్రమాదాలను ఎదుర్కోవలసి వస్తోందని అంటున్నారు. ముఖ్యంగా మహిళలు ఒకరికొకరు తోడై చీకట్లో బిక్కు బిక్కు మంటూ చెంబు చేతపట్టి బహిరూమికి వెళ్లక తప్పిందిలేదని చెబుతున్నారు. ప్రభుత్వాలు స్వఛ్ భారత్ అంటూ రక రకాల ప్రకటనలు ఇస్తున్నాయే తప్ప, ఇలాంటి పెద్ద కాలనీల్లో ప్రజల అవసరాలకు తగిన సౌకర్యలు కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదని అక్కడి స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ కాలనీలో మురుగు నీటి కాలువలు నిర్మించడానికి, నీటి అవసరాలు తీర్చడానికి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉన్నత పాఠశాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అపనరం ఎంతైనా ఉంది.

నీటి సమస్య పరిష్కరించాలి



ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించి, ఇక్కడి ప్రజల అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ఉంది. కాలనీ ఏర్పడి పదహారేళ్లైనా ఇక్కడి సమస్యలు పరిష్కరించడంలో అటు అధికారులో, ఇటు స్థానిక ప్రజాప్రతినిధులో శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

- శ్రీరాములు నాయక్, ఇందిరమ్మ కాలనీ, పీలేరు.

మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, నీటి అవసరాలు తీర్చాలి



ఇందిరమ్మ కాలనీలో మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టి, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని, రోజు వారి అవసరాలకు, తగినన్ని నీళ్లు లేక, రాక తాము పడుతున్న ఇబ్బందులను తీర్చాలి. కుళాయిల ద్వారా అందుతున్న నీరు కూడా చాలీచాలకుండా వస్తున్నాయి. అది కూడా రెండు వారాలకోసారి సరఫరా చేస్తున్నారు. నీటి కోసం తగినన్ని బోర్లు వేసి నీరు అందించాలి.

- జి.లక్ష్మమ్మ, ఇందిరమ్మ కాలనీ, పీలేరు.


ఎపిజిబిలో రుణాలను రెన్యువల్ చేయించుకుంటున్న రైతులు

ఎపిజిబిలో రుణాల రెన్యువల్

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక ఎపిజిబి బ్యాంకులో క్రాప్ రుణాల రెన్యువల్స్ ఉండడంతో మంగళవారం ఎపిజిబి బ్యాంక్‌లో రైతులు సందడితో నిండుకుంది. శాఖ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల పరిధిలో 2700 వందల మంది రైతులు క్రాప్ రుణాలు పొంది ఉన్నారని వారికి ఇచ్చిన తేదీని బట్టి ఆరోజు వచ్చి వారు రెన్యువల్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ మాసం నుంచి జూన్‌తో రుణాల రెన్యువల్స్ పని పూర్తవుతుందని పేర్కొన్నారు. రైతులు వారికి ఇచ్చిన రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట


రక్తదానం చేస్తున్న అనిల్‌కుమార్

చికిత్స పొందుతున్న ఓ చిన్నారికి యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ బాసటగా నిలిచింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ మాట్లాడుతూ బెంగళూరు నగరంలోని మణిపాల్ ఆసుపత్రిలో ఓ చిన్నారి చికిత్స కోసం రక్తం అవసరమని తమ ఫౌండేషనుకు సమాచారం అందిందని అన్నారు. తమ ఫౌండేషన్ సభ్యులలో ఒక్కరైన అనిల్ కుమార్ ఆ చిన్నారి చికిత్సకు అవసరమైన రక్తాన్ని అందించి ప్రాణాలను నిలబెట్టారని చెప్పారు. తమ ఫౌండేషన్ ద్వారా అనేక సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపరు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సకాలంలో తమ బిడ్డకు రక్తాన్ని అందించిన యంగ్ ఇండియా ఫౌండేషన్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


శ్రీమిత్ర స్నేహిత శివలక్ష్మి

సిబిఎస్ఇ ఫలితాలలో 'శాన్వి' ప్రభంజనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సిబిఎస్ఇ 2023-24 గ్రేడ్స్ ఫలితాలలో రాజంపేట మండల కేంద్రంలోని తాళ్లపాక వద్ద ఉన్నటువంటి శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ బచ్చోటి విజయనిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలలో 13 మందికి జిల్లాస్థాయి, 9 మంది ప్రథమస్థానం, 14 ద్వితీయస్థానం, ఇద్దరు తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించారని అన్నారు. ఈ ఫలితాలలో 94.2 శాతంతో ప్రథమ స్థానంలో శ్రీమిత్ర, 93.2 శాతంతో రెండవ స్థానంలో స్నేహిత, 91శాతంతో తృతీయ స్థానంలో శివలక్ష్మి నిలిచారన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు, సిఇఒ శంకర్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ భరత్ కుమార్ రాజు విద్యార్థులను ప్రోత్సహించి, ఉపాధ్యాయులను అభినందించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం

పజాశక్తి - చాపాడు

విపరీతమైన ఎండల తర్వాత వచ్చే వర్షాకాలం శరీరానికీ, మనసుకీ ఎంతో హాయినిస్తుంది. తొలకరి జల్లుకే మట్టివాసన అనిర్వచనీయమైన ఆనందాన్ని కలుగజేస్తుంది. ఈ ఆనందాన్ని పూర్తిగా పొందాలంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా ఎంతో అవసరం. వర్షాకాలం, శీతాకాలం, ఎండాకాలం ఇలా సీజన్ ఏదైనా ప్రజల్ని పలు రకాల వ్యాధులు చుట్టుముడుతూనే ఉంటాయని, జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. సహజంగానే సీజన్ మారినప్పుడు జలుబు, దగ్గు, తుమ్ములు, వాంతులు, నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, మెదడువాపు వంటి వ్యాధులు సంభవిస్తాయి. ఇవన్నీ కూడా నీరు కలుషితం కావడం కారణంగానే వస్తాయి. నిల్వ ఉన్న నీటిలో బ్యాక్టీరియా, ఫంగస్ వ్యాప్తి చెందుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఈగలు వాలిన ఆహార పదార్థాలను, శీతల పానీయాలను తీసుకోకూడదని వైద్యులు సూచిస్తున్నారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం చాలా మంచిది. దోమకాటు వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆహారం తీసుకునే ముందు, వాష్‌రూం వెళ్లిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. ఇంటి పరిసరాలను శభ్రంగా ఉంచుకోవాలి. క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని సూచిస్తున్నారు. కాచి వడబోసిన నీటినే తాగాలి. డయేరియా వ్యాధి బారిన పడిన వారికి రోజుకు వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగించాలి. శుభ్రమైన చోట మాత్రమే మంచినీటిని పెట్టాలి. అలాగే నీటిపై మూత పెట్టడం మరవొద్దు. మంచినీరు ఉంచిన చోట స్నానం చేయడం, బట్టలు ఉతకడం చేయొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఉపయోగించే ముందు కాయగూరలు, పండ్లను శుభ్రంగా కడగాలి. సాధ్యమైనంత వరకు అప్పుడే వండిన ఆహారాన్ని తీసుకోవాలి. రాత్రి పూట నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, ముఖ్యంగా మాంసాన్ని తినొద్దు. భోజనం చేసే సమయంలో చేతులను సబ్బుతో కడుక్కోవాలి. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూత పెట్టాలి. ఇంటి పరిసరాలను, ఆవరణాన్ని ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకుంటున్నారు

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రజలు కోరుకుంటున్నారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం తన గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపు నెలలో వెలువడే ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు సహకరించిన ప్రజలకు, కూటమి పార్టీలలైన జనసేన, బిజెపి, టిడిపి, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు పొరుగు రాష్ట్రాల నుంచి విదేశాల నుంచి సైతం వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. గడచిన ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి కానీ, పారిశ్రామిక కారిడార్‌లు కానీ, ఎంఎన్‌సి కంపెనీలు కానీ మన రాష్ట్రానికి వచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. అరాచకాలు, భూదందాలు, దాడులు, ఇసుక, మైనింగ్ దోపిడీలు చేసి ఆ డబ్బులతో ఎన్నికలలో ప్రజలకు పంచారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చి అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొని ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, సిటిఎం మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, జి.పనికర్‌రెడ్డి, టిడిపి నాయకులు జంగాల వెంకటరమణ, కౌన్సిలర్ గాంధీ , మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి పాల్గొన్నారు.

పోలింగ్ సరళి టిడిపికే అనుకూలం

నిమ్మనపల్లె : భారీ ఓటింగ్ నమోదు టిడిపికి అనుకూలంగా ఉంటుందని, జూన్ 4 వ తేదీ తరువాత రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నేతృత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడుతుందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్.వెంకటేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో క్రిష్టియన్ సెల్ అధ్యక్షులు దేవారమేష్, సీనియర్ నాయకులు రాజన్న, అన్వర్ బాషా, నరసింహులు, లోకేష్, సోమశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె అసెంబ్లీ అభ్యర్థి షాజహాన్‌బాషా అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయం అన్నారు. వైసిపి దౌర్జన్యాలను ఎదుర్కొని ప్రజలు స్వచ్ఛందంగా ఓటింగ్‌లో పాల్గొనడం దుష్ట ప్రభుత్వాన్ని సాగనంపడానికే సంకేతమని అన్నారు. అర్ధరాత్రి వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉండి ఓటు వేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని నింపిందని అన్నారు. వల్లభనేని వంశీ, తెనాలి ఎమ్మెల్యే అన్నబత్తుల కుమార్ లాంటి వాళ్ళను సామాన్య ప్రజలు ఎదిరించడం వైసిపి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు ని దర్శనమని అన్నారు. మధ్యాహ్నం పోలింగ్ సమయానికే నగరిలో మంత్రి రోజా తనకు సొంత పార్టీ వారే ఓడించడానికి ప్రయత్నం చేస్తున్నారని చెప్పడం ప్రజా వ్యతిరేకతకు కారణం అన్నారు. రాజంపేట పార్లమెంటులో కిరణ్ కుమార్ రెడ్డి గెలుస్తారని, వైసిపి వారే భారీగా క్రాస్ ఓటింగ్ చేయడం తమ దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన ఓటింగ్ ద్వారా నిరుద్యోగులు, యువత ప్రభుత్వంపై కసి తీర్చుకున్నారని అన్నారు. టిడిపి కూటమి విజయానికి ప్రజలు మద్దతుగా నిలిచినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్.జె.వెంకటేష్

పీలేరులో 81.09 శాతం పోలింగ్

- ◆2019లో 79 శాతం
- ◆2024లో 2.9 శాతం పెరిగిన ఓటింగ్

ప్రజాశక్తి-పీలేరు

2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం 163 పీలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో 81.09 శాతం ఓట్లు పోలయ్యాయి. మంగళవారం పీలేరు ఆర్ఓ, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మీడియాకు నియోజకవర్గంలోని 6 మండలాల్లోనూ పోలైన ఓట్ల వివరాలను ప్రకటించారు. నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,14,962 మంది, మహిళా ఓటర్లు 1,19,624 మంది, ఇతర ఓటర్లు 22 మంది మొత్తం 2,34,608 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 93,854 మంది, మహిళా ఓటర్లు 96,364 మంది, ఇతర ఓటర్లు 16 మంది మొత్తం 1,90,234 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 81.09 శాతం ఓట్లు పోలయ్యాయి. వీటితో పాటు 2,752 పోస్టల్ బ్యా, 432 సర్వీస్ ఓట్లు కూడా ఉన్నాయి. మండలాల వారీగా గుర్రంకొండ మండలంలో 34, 777 మంది ఓటర్లకు గాను 29,646 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని 85.25 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే కలకడ మండలంలో 27,913 ఓట్లకు గాను 23,666 ఓట్లు నమోదై 87.33 శాతం, కెవి పల్లి మండలంలో 31,910 ఓట్లకు గాను 26,724 ఓట్లు నమోదై 89.29 శాతం, మంది వాల్మీకిపురం మండలంలో 36,533 ఓట్లకు గాను 30,579 ఓట్లు నమోదై 83.70 శాతం, కలికిరి మండలంలో 40,686 ఓట్లకు గాను 32,261 ఓటు నమోదై 79.42 శాతం, పీలేరు మండలంలో 62,789 ఓట్లకు గాను 47,358 ఓట్లు నమోదై 75.42 శాతం పోలింగ్ నమోదైంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పీలేరు నియోజకవర్గంలో 79 శాతం ఓట్లు పోలయ్యాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 81.09 శాతం ఓట్లు పోలయ్యాయి. దీంతో ఈసారి ఎన్నికల్లో 2.09 శాతం ఓట్లు అదనంగా నమోదై ఓటింగ్ శాతం పెరిగింది.

రాజంపేటలో గతం కంటే తగ్గిన పోలింగ్

రాజంపేట అర్బన్ : రాజంపేట నియోజకవర్గంలో 2019 సార్వత్రిక ఎన్నికల కంటే ప్రస్తుతం 3.4 శాతం పోలింగ్ తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. నియోజకవర్గంలో మొత్తం ఆరు మండలాలు ఉండగా సిద్దవటంలో మొత్తం ఓటర్లు 31,429, అలాగే ఒంటిమిట్టలో 24,586 మంది ఓటర్లు ఉన్నారు. నందలూరు మండలంలో 28,551 మంది, రాజంపేట మండలంలో 83,990 మంది, వీరబల్లి మండలంలో 28,128 మంది, టి.సుండుపల్లి మండలంలో 44,516 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 2,41,200 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1,83,442 ఓట్లు పోలయ్యాయని, 95,652 మంది మహిళా ఓటర్లు, 87,790 మంది పురుష ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్.ఓ మోహన్ రావు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లో 2,211 ఓట్లు పోలయ్యాయన్నారు. 2019 లో 80.39 శాతం పోలవ్వగా 2024 లో 76.99 శాతం పోలింగ్ జరిగిందని, గతంతో పోల్చితే 3.4 శాతం పోలింగ్ తగ్గిందని తెలిపారు. కౌంటింగ్ తేదీ నాటికి సర్వీస్ ఓటర్లు అదనంగా ఉంటారని జూన్ రెండు నాటికి పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగే అవకాశం ఉందన్నారు.

ఘాటెక్కిన పచ్చి మిర్చి ధర

కిలో రూ.150 - కొనలేని పేద, మధ్య తరగతి ప్రజలు



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పచ్చిమిర్చి ధర భగ్గుమంటోంది. కొని తినకుండానే మంట పుట్టిస్తోంది. నెల రోజుల్లోనే దీని ధర రెట్టింపై కొండెక్కి కూర్చుంది. పచ్చిమిర్చి ధర విపరీతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి. ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. పచ్చిమిర్చి ధర కొన్నాళ్ళుగా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో పచ్చిమిర్చి ధర రూ.150 వరకు పలుకుతోంది. ఇదే పరిస్థితి ఇంకా నెల రోజులపాటు కొనసాగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఎండలు విపరీతంగా ఉండడంతో మిర్చి పంట పూత రాలిపోతోంది. పూత రాలకుండా నివారణకు క్రిమి సంహారక మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. రైతులు పచ్చిమిర్చి ధర పెరిగినప్పటికీ వాతావరణం అనుకరించడం లేదని రైతులు వాపోయారు. మిర్చి ధర.150 మార్కెట్లో ధర ఉన్నప్పటికీ రైతుల దగ్గర నుంచి రూ.80 నుండి రూ.100లతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అన్ని రకాల వంటకాల్లో మిర్చి అవసరం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నారు.

విస్తీర్ణం తగ్గడంతోనే ధరలు పెరిగాయి

పచ్చిమిర్చి పంట విస్తీర్ణం తగ్గడం వల్ల స్థానికంగా పచ్చిమిర్చి పంట లభ్యం కాకపోవడం వల్లే ధరలు అమాంతం పెరిగేందుకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పచ్చిమిర్చి మార్కెట్‌కు వచ్చేది. ప్రస్తుతం ధర తగ్గే పరిస్థితి లేదు.

- పుల్లయ్య, కూరగాయల వ్యాపారి, పులివెందుల

పంట సాగుకు అధిక ఖర్చు

మిరప సాగు చేయడానికి అధిక ఖర్చవుతుంది. సాగు ప్రారంభం నుంచి మందులు వాడాలి. ఎక్కువగా తెగులు రావడం, ఎండకు పూత రాలుతోంది. దీని నివారణకు అధిక ఖర్చు చేయాల్సి వస్తుంది. పంట కోతకు కూడా కూలీలు ఎక్కువ అవసరం. కూలీల ఖర్చు కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో పంట సాగు చేయడానికి రైతులు పెద్దగా ముందుకు రావడం లేదు.

- జి.మాధవి, రైతు, లింగాల

పచ్చిమిర్చి వాడకాన్ని తగ్గించాల్సి వస్తోంది

వ్యవసాయ పనులు లేకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోంది. పచ్చిమిర్చి ధరలు పెరగడంతో వాడకాన్ని తగ్గించాల్సి వస్తోంది. అన్ని రకాల కూరల్లో పచ్చిమిర్చి ఖచ్చితంగా అవసరం. పెరిగిన ధరతో పచ్చిమిర్చి కొనలేని పరిస్థితి.

- సావిత్రి, వ్యవసాయ కూలీ, పులివెందుల

బలిజలపై దాడి అమానుషం

ప్రజాశక్తి - వేంపల్లె

సార్వత్రిక ఎన్నికల్లో బలిజ కులస్తులపై వైసిపి నాయకులు దాడి చేయడం అమానుషమని టిడిపి మండల యూనిట్ ఇన్‌ఛార్జి పోతిరెడ్డి శివ పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో వైసిపి నేతలు ప్రవర్తించిన తీరు దుర దృష్టకరమన్నారు. ఎన్నికల్లో టిడిపి ఏజెంట్లను బూత్‌లో నుండి బయటికి వెళ్లండి.. మేము ఓట్లు వేసుకుంటామనడం బాధాకరమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఈ దౌర్జన్యం, ఈ హుందాతనం టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 2014 నుంచి 2019 వరకు సతీష్‌రెడ్డి ఎందుకు చేయలేదో మాకు అర్థం కావడం లేదన్నారు. వైసిపితో లాలూచీ పడినట్లు మా నాయకుడు లోకేష్ అనడంలో తప్పు లేదన్నారు. బిటెక్ తనయుడు రామిరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తనయుడు సాయిరెడ్డి రాజకీయాల్లో ఎంతో ఉన్నత హోదాతనంగా ప్రవర్తిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని చెప్పారు. టిడిపిలో ఉన్నప్పుడు వైసిపిలోని బలిజ కులం మీదనే దాడి జరిగిందని, మళ్లీ ఇప్పుడు మీరు వైసిపిలో ఉన్న ప్పుడు టిడిపి బలిజ కులం మీద దాడి జరుగినట్లు చెప్పారు. గతంలో గండి చైర్మన్ పదవి కూడా రాకుండా చేశారని తెలిపారు. కాపు జాతి ఉద్యమం చేసి గండిలో సమావేశం పెట్టి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన తర్వాత తప్పదు అనుకోని అప్పుడు ఒక వ్యక్తికి ఇవ్వడం జరిగిందని చెప్పారు. బలిజ కుల స్తులపై అసూయ, ద్వేషాన్ని తగ్గించుకోవాలని కోరారు. విలేక రుల సమావేశంలో టిడిపి ఫైనాన్స్ ఆర్గనైజర్ నామ వేమా, బలిజ సంఘం నాయకుడు ఎడాల జగదీష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోతిరెడ్డి శివ


మాట్లాడుతున్న దేశాయి తిప్పారెడ్డి

సంక్షేమ పథకాలే వైసిపిని గెలిపిస్తాయి

ప్రజాశక్తి-మదనపల్లి

వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తిరిగి ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గెలిపిస్తాయని మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా అధిక శాతం పోలింగ్ నమోదు కావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్, ఎపిఎండిసి చైర్‌పర్సన్ జి.షమీం అస్లాం మాట్లాడుతూ రాష్ట్రంలో వయోవృద్ధులకు, ప్రజలకు అందిం చిన సంక్షేమ పథకాలతో వైసిపికి ఆదరణ వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు డాక్టర్ ఎవి.సుబ్బా రెడ్డి, సర్పంచ్‌లు ఆనంద్ పార్థసారథి, మధుసూదన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు : 'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి

తనపై నమ్మకం ఉంచి చంద్రబాబునాయుడు తన పేరు ప్రకటించి మొదటి నుంచి ఇప్పటి వరకు తన వెంట ఉండి సహకరించిన అందరికీ ప్రత్యేక దన్యావాదాలు అని రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణం చేయబోతున్నారని జోస్యం చెప్పారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన గెలుపునకు ఎండలో కూడా నిలబడి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తున్నందుకు అందరికీ రుణపడి ఉంటానని తెలిపారు. రాయచోటి ప్రజల కష్టాలు తీరు స్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన వాగ్దానాలన్నీ తప్పకుండా నెరవేరుస్తానన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తనదిగా భావించి వారికి అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గం పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా, టిడిపి నాయకులు సురేష్, ఖాదర్, మహీధీన్, ఎజాస్, అతావుల్లా, సుల్తాన్ పాల్గొన్నారు.

ఉత్సాహం చూపిన ఓటర్లకు కృతజ్ఞతలు : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేందుకు ఉత్సాహంగా ఓటేసి ఓటింగ్ శాతాన్ని అత్యధికంగా పెంచిన ఓటర్లకు ధన్యవాదాలు అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రొద్దుటూర నియోజకవర్గంలో 2లక్షల 47వేలు ఓటర్లుండగా ఇందులో 1లక్షా97వేల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, వీరిలో మొదటిసారి ఓటేసిన ఓటర్లకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పురుషుల కంటే 7వేల మంది మహిళలు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా ఓడినా అంతిమ విజయం మాత్రం ప్రజలదే అన్నారు. ప్రజాతీర్పు అమలవుతుందన్నారు. వారికి కావలసిన ప్రతినిధిని స్వేచ్ఛగా ఎన్నుకున్నారన్నారు. జూన్4 వరకు వేచి చూడాలన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన అధికారులు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. 99 శాతం ఉద్యోగులు నిష్పక్షికంగా వ్యవహరించారన్నారు. 2టౌన్ ఎస్ఐ రామకృష్ణ మాత్రం టిడిపికి తొత్తుగా వ్యవహరించారని ఆరోపించారు. సంజీవనగర్, కృపానగర్, స్వరాజ్య నగర్, బిసి హాస్టల్ బూత్‌లలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడని, అతని మీద తగిన చర్యలు తీసుకోవాలని ఇసి, డిజిపి, ఎస్‌పికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఏదైనా సేచ్ఛాయుత వాతావరణంలో జరగాలని కోరారు. తనను గెలిపించేందుకు నడుం బిగించిన అభిమానులకు అనంతకోటి అభివందనాలని, ఇందుకోసం జూన్4 వరకు వేచి ఉందామని రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు.

పోలింగ్ సజావుగా నిర్వహించాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తహశీల్దార్ భీమేశ్వరరావు, ఎస్ఐ అనిల్‌కుమార్, ఎంపిడిఒ సల్మాన్ రాజ్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2024 సాధారణ ఎన్నికలకు సహకరించిన ఓటర్లు, అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, పోలీసులు, ఇతర శాఖల అధికారులు, మీడియా వ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఎలాంటి చిన్నపాటి ఘర్షణలు లేకుండా పోలింగ్ సజావుగా సాగడం ఎంతో సంతోషించదగ్గ పరిణామమని వారు పేర్కొన్నారు. ప్రశాంత పోలింగ్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

క్రైం కార్నర్

మహిళపై కత్తితో దాడి

ప్రజాశక్తి-మదనపల్లి


గాయపడ్డ సావిత్రమ్మ

ఇంట్లో ఒంటరిగా ఉన్న మేనత్తపై ఆమె మేనల్లుడు కత్తితో పొడచి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక మంజునాథ కాలనీలో నివాసమున్న శంకర భార్య సావిత్రమ్మ(45) కూలి పనులతో జీవనం సాగిస్తోందని తెలిపారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సావిత్రమ్మపై ఆమె మేనల్లుడు లోకేష్ చొరబడి నోరు అనగబట్టి కత్తితో మెడ, గొంతు, పొత్తి కడుపులో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారని చెప్పారు. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు కేకలు వేయడంతో స్థాని కులు బాదితురాలిని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఆస్పత్రి అత్య వసర విభాగం డాక్టర్లు మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటోందని చెప్పారు. ఈ ఘటనపై రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికలకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లె అసెంబ్లీ నియోకవర్గం,బి.కొత్తకోట మండలం, ఒడిగలవారిపల్లి గ్రామం పోలింగ్ స్టేషన్ నెంబర్ 174లో భార్గవ్ అనే వ్యక్తి ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినందుకు ప్రశ్నించిన ఎన్నికల అధికారులపై దౌర్జన్యంగా మాట్లాడినందుకుగాను ప్రీసీడింగ్ ఆఫీసర్ సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల నిబంధనల మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు సిఐ సూర్య నారాయణ తెలిపారు. మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని,ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.